# ఒప్పుల కుప్ప

ఒప్పుల కుప్ప
ఒయ్యారి భామ
    సన్న బియ్యం
    ఛాయ పప్పు
చిన్ని మువ్వ
సన్నగాజు
    కొబ్బరి కోరు
    పాకం పప్పు
గూట్లో రూపాయి
గుటుక్కు మన్నాయి

# దాగుడు మూతలు

దాగుడు మూతలు దండాకోర్
పిల్లి వచ్చె ఎలకా భద్రం
ఎక్కడి డొంగలు ఆక్కడే
గప్ చిప్...గప్ చిప్

కళ్ళా మూసి కోతి కోల్
ఎక్కడి దొంగలు అక్కడే
అణుక్కో ముణుక్కో దాక్కో
గప్ చిప్...గప్ చిప్

## తారంగం తారంగం

తారంగం తారంగం
తాండవ కృష్ణ తారంగం

వేణునాధా తారంగం
వెంకటరమణ తారంగం

వెన్నల దొంగా తారంగం
చిన్ని కృష్ణ తారంగం

## వారములు

ఆదివారము నాడు అరటి మొలచినది
సోమవారము నాడు సుదివేసి పెరిగినది
మంగలవారము నాడు మారాకి తొడిగినది
బుధవారము నాడు పొత్తిగెల వేసినది
గురువారము నాడు గుబురుగా దాగినది
శుక్రవారము నాడు చూడగా పండినది
శనివారము నాడు చక చకా గెలకోసి
అందరికి పంచితిమి అరటి అత్తములు

## చెమ్మ చెక్క

చెమ్మ చెక్క - చారడేసి మొగ్గ
అట్లు పోయంగ - ఆరగించంగ

ముత్యాల చెమ్మచెక్క - రంగులేయంగ
రత్నాల చెమ్మచెక్క - రంగులేయంగ

పగడాల చెమ్మచెక్క - పందిరేయంగ
పందిట్లో రామయ్య - పెండ్లి సేయంగ

సీతమ్మ సిగ్గంత - సింది పోవంగ
చూసి వత్తం రండి - పూలేసి వత్తము రండి

## చందమామ రావే

చందమామ రావే జాబిల్లి రావే
కొండెక్కి రావే కోటిపూలు తేవే

బండెక్కి రావె బంతిపూలు తేవే
తేరు మీద రావే తేనె పత్తు తేవే

పల్లికిలో రావే పాలు పెరుగు తేవే
పరుగెత్తి రావే పనస పండు తేవే

అలయకుండా రావే అరటి పండు తేవే
అన్నిటిని తెచ్చి అబ్బాయికివ్వవే

## జన్మభూమి

ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము

## వరిచేలు పండాలి

వానల్లు కురవాలి - వానదేముడా
వరిచేలు పండాలి - వానదేముడా
నల్లని మేఘాలు - వానదేముడా
చల్లగా కురవాలి - వానదేముడా

మావూరి చెరువంత - వానదేముడా
ముంచెత్తి పోవాలి - వానదేముడా
కప్పలకు పెండ్లిండ్లు - వానదేముడా
గొప్పగా చెస్తాము - వానదేముడా
పచ్చగా చేలంత - వానదేముడా
పంటల్లు పండాలి - వానదేముడా
వానల్లు కురవాలి - వానదేముడా
వరిచేలు పండాలి - వానదేముడా

## చిట్టి చిట్టి చెల్లెమ్మా!

చిట్టి చిట్టి చెల్లెమ్మా -
పలకా బలపం తేవమ్మా
అక్షరాలు నేర్వమ్మా
చదువు బాగా పెంచమ్మా
ఇంటికి పేరు తేవమ్మా

## పలక

పలక నీది నల్లన
పైన రాతి తెల్లన
అ ఆ ఇ ఈ రాశారు
అమ్మ ముందు పెట్టారు
అమ్మ లడ్డు ఇచ్చింది
ఆనందంగా తిన్నారు

## ఒకటి రెండు మూడు

ఒకటి ఒకటి ఒప్పుల కుప్ప
రెండు రెండు రెక్కల పక్షి
మూడు మూడు ముక్కాలి పీట
నాలుగు నాలుగు మా ఆవు కాళ్ళు
ఐదు ఐదు నా చేతి వేళ్ళు

## భారత భూమికి జేజే

అమ్మకు జేజే
నాన్నకు జేజే
బంగరు భారత భూమికి జేజే
చదువులు నేర్పే గురువుకు జేజే

## తప్పెట్లోయ్ తాళాలోయ్

తప్పెట్లోయ్ తాళాలోయ్
దేముడి గుళ్ళో బాజాలోయ్
పప్పు బెల్లం దేముడికోయ్
పాలు నెయ్యి పాపడికోయ్

## బావా! బావా! పన్నీరు

బావా! బావా! పన్నీరు
బావను పట్టుకు తన్నేరు
వీధి వీధి తిప్పేరు
వీసెడు గంధం పూసేరు

బావని గుంజకు కట్టేరు
చప్పిడి గుద్దులు గుద్దేరు
పట్టె మంచం వేసేరు
పాతిక గుద్దులు గుద్దేరు
నులక మంచం వేసేరు
నూరు గుద్దులు గుద్దేరు

## బుర్రుపిట్ట

బుర్రుపిట్ట బుర్రుపిట్ట తుర్రుమన్నది
పడమటింటి కాపురము చేయనన్నది
అత్త తెచ్చిన కొత్త చీర కట్టనన్నది
మామ తెచ్చిన మల్లెపూలు ముడువనన్నది
మొగుని చేత మొట్టికాయ తింటానన్నది

## ఏనుగమ్మ ఏనుగు

ఏనుగమ్మ ఏనుగు
ఏ వూరెళ్లిందేనుగు
మంచినీళ్ళు తాగిందేనుగు
ఏనుగమ్మ ఏనుగు
ఏనుగు ఏనుగు నల్లన
ఈనుగు కొమ్ములు తెల్లన
ఏనుగు మీద రాముడు
ఎంతో చక్కని దేముడు

## చిట్టి చిట్టి మిరియాలు

చిట్టి చిట్టి మిరియాలు
చెట్టు కింద పోసి
పుట్ట మన్ను తెచ్చి
బొమ్మరిల్లు కడితే
బొమ్మరింట్లో పాప పుట్టె

## చేతవెన్నముద్ద

చేతవెన్నముద్ద
చెంగల్వ పూదండ
బంగారు మొలతాడు
పట్టుదట్టి
సందె తాయెతులు
సరి మువ్వ గజ్జెలు
చిన్ని కృష్ణ నిన్ను
చేరి కొలుతు

## చుక్ చుక్ రైలు

చుక్ చుక్ రైలు వస్తోంది
దూరం దూరం జరగండి
ఆగగానే ఎక్కండి
జోజో పాపా ఏడవకు
నాన్నగారు వస్తారు
లడ్డు మిఠాయి తెస్తారు
నీకు నాకు ఇస్తారు

## చిట్టి చిలకమ్మా

చిట్టి చిలకమ్మా
అమ్మ కొట్టిందా
తోట కెళ్ళేవా?
పండు తెచ్చేవా?
గూట్లో పెట్టేవా?
గుటుక్కు మన్నావా

## ఏ ఇల్లు మేలు

ఇళ్ళల్లోకెల్ల ఏ ఇల్లు మేలు
శ్రీ లక్ష్మి నివసించు మా ఇల్లు మేలు
వీధులలో కెల్ల ఏ వీధి మేలు?
విద్వాంసులున్నట్టి మా వీధి మేలు

అరుగులలోకెల్ల ఏ అరుగు మేలు?
పండితులు కూర్చునే మా అరుగు మేలు
తోటలలో కెల్ల ఏ తోట మేలు?
మామిడి చెట్లున్న మా తోట మేలు

## అమ్మణ్ణి

గంధం మెడకు పూసుకొని
పసుపు కుంకుమ రాసుకొని
కంటికి కాటుక పెట్టుకొని
ఆడవే ఆడవే అమ్మణ్ణి
పువ్వులు తలలో ముడుచుకొని
తిలకం నుదుట దిద్దుకొని
బుగ్గను చుక్కా పెట్టుకొని
ఆడవే ఆడవే అమ్మణ్ణి

## కాళ్ళా గజ్జా కంకాలమ్మా

కాళ్ళా గజ్జా కంకాలమ్మా
వేగు చుక్క వెలగ మొగ్గ
మొగ్గ కాదు, మోదుగ నీరు
నీరు కాదు సిమ్మల బావి
బావి కాదు బచ్చలి పండు
పండు కాదు పాపాయి కాలు
కాలు తీసి పక్కన పెట్టు

## చెన్నా పట్నం చెరుకు ముక్క

చెన్నా పట్నం చెరుకు ముక్క
నీకో ముక్క నాకో ముక్క
భీమిని పట్నం బిందెల జోడు
నీకో బింది నాకో బింది
కాశీపట్నం - కాసుల పేరు
నీకో కాసు - నాకో కాసు

## చిన పాపా!!

చందమామ ఇల్లు కట్టి
చుక్కల ముగ్గు చక్కగ పెట్టి
అత్తా చెపిలో ముత్యాల్ పోసీ
ఆడుదాం రావే చిన్న పాపా!

## మేలుకొలుపు!!

చిన్నారి పొన్నారి చిట్టి నా తల్లి
చుక్కల్లో చంద్రుడూ చూడవచ్చాడు
తెల్లవారొచ్చింది కోడి కూసింది
చూచేటి అక్కల్లు చూడరారమ్మా
ఆడేటి అక్కల్లు ఆడరారమ్మ
ఆడుకోరారమ్మ అక్కల్లు మీరు
ఆడేటి వారికి అచ్చావు పాలు
పాడేటి వారికి పాలు పంచదార

## ఆడవే పాప!!

రాయకు పాపమ్మ ఆడవే పాప
రాజులందరు గూడి చూడ వచ్చారు
చూడవచ్చిన వారు ఏమి తెచ్చారు
పట్టాభి వుంగ్రాలు పెళ్ళిబటి పూలు
నన్ను గన్నా తండ్రి చీరెట్టనమ్మ
చీరకీ చిలకం అంచెట్టరమ్మ
పిలకీకి రత్నాలు పేరెట్టరమ్మ
పేరుకీ పెట్టెలతో సొమ్మెట్టరమ్మ

## ఆడుదాం - పాడుదాం!!

ఆడుదాం పాడుదాం
అల్లరెంతో చేయుదాం
గెంతుదాం దూకుదాం
గమ్మత్తెంతో చేయుదాం
కుందుదాం కూలుదాం
గుంజనాలు తీయుదాం
పరుగుదాం పట్టుదాం
గుంజికాయ గుంజుదాం

## చిప్ప చిప్ప గోళ్ళు!!

చిప్ప చిప్ప గోళ్ళు సింగరాజు గోళ్ళు
మా బావి నీళ్ళు మండాప రాళ్ళు
మా మామ కాళ్ళు మంచం కోళ్ళు

## ఆటకు పిలుపు!!

పిల్లల్లారా రండి
పిడికెడు బియ్యం తెండి
ఆడుకుందాం రండి
అట్ట ముక్కలు తెండి
శీలశీల బండి
చిత్రమైన బండి
కొత్తగుర్రాల బండి
కొనుక్కుందాం రండి

## ఊరెళదాం!!

బండి ఎక్కి మనము
ఏ ఊరెళదాము?
బండి ఎక్కి మనము
బందరు వెళదాము

సైకిలు ఎక్కి మనము
ఏ ఊరెళదాము?
సైకిలు ఎక్కి మనము
సాలూరెళదాము

పడవ ఎక్కి మనము
ఏ ఊరెళదాము?
పడవ ఎక్కి మనము
పట్నం వెళదాము

రైలు ఎక్కి మనము
ఏ ఊరెళదాము?
రైలు ఎక్కి మనము
రాచూరెళదాము

విమానమెక్కి మనము
ఏ ఊరెళదాము?
విమానమెక్కి మనము
వెయ్యూళ్ళెళదాము

## కోడీ కోడీ కొక్కొరోకో!!

కోడీ కోడీ కొక్కొరోకో
కాకీ కాకీ కావ్ కావ్
తెల్లవారింది తెలిపి వచ్చింది
అమ్మ లెమ్మంది ఆడుకొమ్మంది

## జానీ జానీ జగ్గయ్య!!

జానీ జానీ జగ్గయ్య
మంచం కింద మామయ్య
చుట్టాలొచ్చారు లేవయ్య
సినిమా కెళ్దాం రావయ్య
వేగం వేగం పదవయ్య

## పిడ్డెం పిడ్డెం!!

పిడ్డెం పిడ్డెం వీసెడు నెయ్యి
పిడ్డెం చెస్తే గిద్దెడు నెయ్యి
మళ్ళీ చెస్తే మానెడు నెయ్యి
పాకీ వస్తే పావు సేరు
దొర్లి వస్తే దుక్క సేరు
నడిచి వస్తే సిండా సేర్
బువ్వలోకి నెయ్య వేసి
వాము పరక నమల వేసి
గోరు గోరు ముద్ద పానకాల ముద్ద
'అ' అని నోట్లో 'గుటుక్' మ్రింగి

## తోడు!!

తోడు పాయసం తోడు
అత్తల్ల బంతికే తోడు
మామల్ల బంతికే తోడు
ముద్దు మాణిక్యం తోడు
తోడితో నీ చెయ్యి వేడి
వేడి పాయసం జుర్రు
జుర్రుతే నే చెయ్యి చుర్రు

## నన్నడుగు!!

పూగుడు చెట్లల్లో గంగూ
కాపురం చేతాము గంగూ
ఆమాను యీమాను పండూ
కోపురేగి మాగిన పండూ
సాకాల యెల్లప్ప జుట్టూ
జుట్టూకు టెంకాయ కొట్టూ
అది వూడిపోతే నన్నడుగూ
జారిపోతే నన్నడుగూ

## బుజ బుజ రేకులు!!

బుజ బుజ రేకుల పిల్లుందా
బుజ్జా రేకుల పిల్లుందా
తాడి మేడి పిల్లుందా
తామరగిరి మొగ్గల్లు

## ఆట పాట!!

అవ్వ ఆట గువ్వ గూట
మువ్వ గజ్జి హంస పజ్జి
కేరి నవ్వి కేకి సువ్వి
కుల్కి పల్కి చిల్కి పుణికి
తేటలాడి తేటి సాట్టి
పాటలాడి కోకిలాడి
ఆట పాట అమరజ్యోతి

## హూత్ కాకీ!!

హూత్! కాకీ
కావు కావు కాకి వచ్చె
కోత్తు! కోత్తు! కోత్తు కాకీ
రివ్వు రివ్వు రొట్టె పోయె
వెక్కి వెక్కి బిడ్డ ఏడ్చె

## కితకిత కితకిత!!

ఇల్లలికి - ముగ్గేసి
పీటేసి - ఆకేసి
పప్పు పెట్టి - పాయసం పెట్టి
అన్నం పెట్టి - అప్పచ్చి పెట్టి
కూర పెట్టి - ఊరగాయ పెట్టి
నెయ్యి వేసి - ముద్ద చేసి
తినిపించి - తినిపించి
చేయి కడిగి - మూతి కడిగి
తాతగారింటికి - దారేదంటే
అత్తవారింటికి - తోవేదంటే
ఇట్లా పోయి - ఇట్లా పోయి
మోచేతి పాలెం - ముందర్నుంచి
ఇట్లా పోయి - ఇట్లా పోయి
ఇదుగో ఇదుగో - వచ్చాం వచ్చాం
చక్కా వచ్చాం - చక్కా వచ్చాం
చక్కిలి గిలిగిలి - చక్కిలి గిలిగిలి

## చందమామ!!

చందమామా చందమామా
అందమైన చందమామా
ఆటలాడ చందమామా
పాటపాడ చందమామా
దిగిరావా చందమామా
దిగిరావా చందమామా

## సోమరి తిమ్మన్న!!

తిండికి రారా తిమ్మన్న
ఇదిగో వస్తానమ్మమ్మా
కట్టెలు కొట్టర తిమ్మన్న
కడుపూ నొస్తుందమ్మమ్మ

## చల్ల చెయ్యి!!

చల్ల చెయ్యి గొల్లభామ నీ
సందిట దండలు కదిలేను
వెన్న చెయ్యి అమ్మాయి నీ
వెండి మురుగులు కదిలేను
పాలు తాగు అబ్బాయి నీ
పమిడి మురుగులు కదిలేను

## అబ్బాయి ధైర్యం!!

నూకలు పెట్టెద ఏకులు వడకు
రూకల సిచ్చెద మేకలు కాయి!
అటుకులు పెట్టెద ఆవులు మేపు
బెబ్బులి వచ్చిన బెదరవు కాదా!
చిరుతలు వచ్చిన పెరవవు కాదా!
ఎలుగులు వచ్చిన ఏడ్వవు కాదా!
వడగండ్లు రాలిన వణకవు కాదా!
ఎంతటి ధైర్యం ఇటు చూడు -
మరి 'ఉష్' అంటే ఉలిక్కిపడ్డావే!

## తీయని గంధం!!

మామిడాకు కోసి తోరణాలు కట్టి
చింతాకు దూసి బుట్టల్లో పెట్టి
తలుపుల చాటున దాగుదమ
కోతీ కొమ్మచ్చులాడుదమ
కొమ్మల చాటున దాగుదమ
తియ్యని గంధము తీయుదమ
బాలిక మెడకు పూయుదమ

## చేతివ్రేళ్ళు!!

తిందాం తిందాం ఒక వేలు!
ఎట్లా తిందాం ఒక వేలు?
అప్పు చేసి తిందాం ఒక వేలు
ఉన్నాను గదా అన్నిటికీ నేను
పొట్టి వాణ్ణి గట్టి వాణ్ణి బొటనవ్రేలు

## ఎందుకు?

ఎండలు కాసేదెందుకురా?
వానలు కురిసేటందుకురా
వానలు కురిసేదెందుకురా?
చెరువులు నిండేటందుకురా
చెరువులు నిండేదెందుకురా?
పంటలు పండేటందుకురా
పంటలు పండేదెందుకురా?
ప్రజలు బ్రతికేటందుకురా
ప్రజలు బ్రతికేదెందుకురా?
స్వామిని కొలిచేటందుకురా
స్వామిని కొలిచేదెందుకురా?
ప్రజలను బ్రోచెటందుకురా